PRGI - TGTEL/25/A0348

జాతీయ తెలుగు దినపత్రిక

సందేశం టైమ్స్

నిజం దాగదు - వార్త ఆగదు

Published by
తెలంగాణ | ఆంధ్రప్రదేశ్

సందేశం టైమ్స్
జాతీయ తెలుగు దిన పత్రిక

సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి జిల్లాల నియోజకవర్గాల ఇన్చార్జిలు మరియు మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను ఆసక్తి గలవారు సంప్రదించండి.
శెట్టి వెంకటేష్ గౌడ్ సీఈవో
సెల్ నెంబర్ : 9052045 435,9542522611.

మంగళవారం 17 నవంబర్ 2026 | పేజీలు : 08 | వెల : 2/- | సంపుటి: 02 . సంచిక : 166 | ప్రచురణ : సూర్యాపేట | ఎడిటర్ : శెట్టి వెంకటేష్

2014కు ముందు ఇళ్ల పథకం లబ్ధిదారులకు పట్టాలు తిరిగి ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం

హైదరాబాద్, నవంబర్ 16: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2014కు ముందు ఇందిరమ్మ ఇళ్లతో పాటు వివిధ ప్రభుత్వ గృహ నిర్మాణ పథకాల కింద ఇళ్లు నిర్మించుకున్న పేదలకు ప్రభుత్వం నుంచి గతంలో తనఖా పెట్టుకున్న ఇంటి పట్టాలు, పొజిషన్ సర్టిఫికెట్లను తిరిగి అందించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నిర్ణయం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా సుమారు 7 లక్షల మంది లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరనుందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు పేదల సొంతింటిపై హక్కులను మరింత భద్రపరిచే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. దాదాపు దశాబ్దకాలంగా తమ ఇళ్లకు సంబంధించిన పట్టాలు, పొజిషన్ సర్టిఫికెట్లు తిరిగి అందక లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ సమస్యను పరిష్కరించాలని ముఖ్యమంత్రి, తనకు పలువురు బాధితుల నుంచి విజ్ఞప్తులు అందాయని మంత్రి వివరించారు. రాష్ట్రంలో భూముల రిజిస్ట్రేషన్లు, 22-ఏ నిషేధిత జాబితాకు సంబంధించిన అంశాలపై సమీక్షలు జరుగుతున్న క్రమంలో తహసీల్దార్ కార్యాలయాల్లో లబ్ధిదారులకు సంబంధించిన ఇంటి పట్టాలు పెద్ద సంఖ్యలో ఉన్నట్లు ముఖ్యమంత్రి దృష్టికి వచ్చిందని, వెంటనే వాటిని సంబంధిత పేదలకు తిరిగి అందించాలని ఆయన ఆదేశించారని తెలిపారు. గతంలో అమలైన గృహ నిర్మాణ పథకాల కింద ప్రభుత్వం సబ్సిడీతో పాటు లబ్ధిదారుల వాటా, బ్యాంకు రుణాల ద్వారా ఇళ్ల నిర్మాణానికి ఆర్థిక సహాయం అందించేదని, బ్యాంకు రుణాలు పొందే సమయంలో లబ్ధిదారుల ఇంటి పట్టాలను ష్యూరిటీగా తనఖా పెట్టుకునేవారని వివరించారు. రుణ వాయిదాలన్నీ పూర్తిగా చెల్లించిన అనంతరం ఆ పట్టాలను తిరిగి లబ్ధిదారులకు అందించాల్సి ఉండేదని, అయితే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ఇందిరమ్మ ఇళ్ల పథకం నిలిచిపోవడంతో వివిధ కారణాల వల్ల కొంతమంది లబ్ధిదారులకు వారి ఇంటి పత్రాలు తిరిగి అందలేదని పేర్కొన్నారు. రుణాలు పూర్తిగా చెల్లించినప్పటికీ ప్రభుత్వ కార్యాలయాల్లోనే మిగిలిపోయిన ఈ పత్రాలను గుర్తించి, అర్హులైన లబ్ధిదారులకు తిరిగి అందించాలని కలెక్టర్లను ఆదేశించినట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో ఏళ్ల తరబడి తమ ఇంటి పట్టాల కోసం ఎదురుచూస్తున్న లక్షలాది పేద కుటుంబాలకు ఊరట లభించనుంది.

27వ అఖిల భారత పోలీస్ బ్యాండ్ పోటీలను ప్రారంభించిన తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్

దేశవ్యాప్తంగా 1,500 మంది పోలీసు సిబ్బందితో 25కు పైగా బ్యాండ్ బృందాల పాల్గొనడం.. ఐదు రోజుల పాటు జాతీయ స్థాయి పోటీలు నిర్వహణ





హైదరాబాద్, నవంబర్ 16: తెలంగాణ రాష్ట్రంలోని రంగారెడ్డి జిల్లా సీఆర్‌పీఎఫ్ గ్రూప్ సెంటర్‌లో 27వ అఖిల భారత పోలీస్ బ్యాండ్ పోటీల ప్రారంభోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర పోలీస్ డైరెక్టర్ జనరల్ (డీజీపీ) శ్రీ సీవీ ఆనంద్ ముఖ్య అతిథిగా హాజరై పోటీలను అధికారికంగా ప్రారంభించారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల పోలీసు విభాగాలు, కేంద్ర సాయుధ పోలీసు బలగాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన 25కు పైగా పోలీస్ బ్యాండ్ బృందాలు, సుమారు 1,500 మంది పురుష, మహిళా పోలీసు సిబ్బంది ఈ జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటున్నారు. నవంబర్ 16 నుంచి 20వ తేదీ వరకు ఐదు రోజులపాటు నిర్వహించనున్న ఈ పోటీల్లో బ్రాస్ బ్యాండ్, పైప్ బ్యాండ్, బ్యూగుల్స్ తదితర విభాగాల్లో పోలీసు సిబ్బంది తమ సంగీత ప్రతిభను, క్రమశిక్షణను, సమన్వయ నైపుణ్యాన్ని ప్రదర్శించనున్నారు. ఈ సందర్భంగా డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ పోలీస్ బ్యాండ్లు కేవలం సంగీత బృందాలు మాత్రమే కావని, అవి ఆయా పోలీసు సంస్థల క్రమశిక్షణ, గుర్తింపు, గౌరవం, ఐక్యతకు ప్రతీకలని పేర్కొన్నారు. జాతీయ పండుగలు, అధికారిక వేడుకలు, కవాతులు, గౌరవ వందనాలు, పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమాల్లో పోలీస్ బ్యాండ్ల పాత్ర ఎంతో విశిష్టమైనదని వివరించారు. సంగీతానికి భాష, ప్రాంతం, సంస్కృతి వంటి భేదాలు ఉండవని, సంగీతం ప్రజలకు, పోలీసు వ్యవస్థకు మధ్య అనుబంధాన్ని పెంపొందించే శక్తివంతమైన మాధ్యమమని అన్నారు. పోలీస్ బ్యాండ్ సభ్యులు నిరంతరం సాధన చేస్తూ సంగీత నైపుణ్యంతో పాటు విధి నిర్వహణలో అవసరమైన క్రమశిక్షణను ప్రదర్శించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఇలాంటి జాతీయ స్థాయి పోటీలు వివిధ రాష్ట్రాలు, కేంద్ర బలగాల మధ్య స్నేహభావం, పరస్పర సహకారం, వృత్తిపరమైన నైపుణ్యం, జాతీయ సమైక్యతను మరింత బలోపేతం చేస్తాయని తెలిపారు. ఈ పోటీల్లో మహిళా పోలీసు సిబ్బంది భాగస్వామ్యం కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. వివిధ బలగాలకు చెందిన మహిళా బ్యాగులర్ల ప్రతిభను డీజీపీ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ సౌత్ సెక్టార్ ఐజీ టి. విక్రమ్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు, వివిధ కేంద్ర సాయుధ పోలీసు బలగాలు, రాష్ట్ర పోలీసు విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు. పోటీల్లో భాగంగా నవంబర్ 17న హైటెక్ సిటీలోని శిల్పారామంలో, నవంబర్ 18న లుంబినీ పార్కులో సాయంత్రం ప్రత్యేక పోలీస్ బ్యాండ్ ప్రదర్శనలు నిర్వహించనున్నారు. ప్రముఖ సంగీత దర్శకులు అనూప్ రూబెన్స్, తమన్ ఈ ప్రదర్శనలకు హాజరుకానున్నారు. ఈ పోటీల్లో భాగంగా వివిధ రాష్ట్రాలు, కేంద్ర బలగాలకు చెందిన బ్యాండ్ సభ్యులు కలిసి నిర్వహించే సంయుక్త కవాతు (కంబైన్డ్ పరేడ్) ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. దేశంలోని పోలీసు బలగాల సంగీత వారసత్వం, ప్రతిభ, క్రమశిక్షణ, ఐక్యతను చాటిచెప్పే ఈ పోటీలు హైదరాబాద్‌కు జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపును తీసుకురానున్నాయి.

మీడియా రంగ సమస్యలపై సమగ్ర అధ్యయనానికి ప్రత్యేక మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలి

జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు మీడియా కమిషన్ అవసరం: TJWA జాతీయ ప్రధాన కార్యదర్శి శెట్టి వెంకటేష్



హైదరాబాద్, నవంబర్ 16: ప్రస్తుత సమాజంలో మీడియా రంగంలో చోటుచేసుకుంటున్న మార్పులు, సోషల్ మీడియా విస్తరణ, జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలు, మీడియా సంస్థల సవాళ్లపై సమగ్ర అధ్యయనం చేసేందుకు ప్రత్యేక మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలని జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా పలువురు ప్రముఖులు అభిప్రాయపడ్డారు. హైదరాబాద్ నాంపల్లిలోని తెలంగాణ మీడియా అకాడమీ కార్యాలయంలో తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టులు, తెలంగాణ మీడియా అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన జాతీయ పత్రికా దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ సోషల్ మీడియా వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా సంస్థలు ప్రజలకు కచ్చితమైన, వాస్తవాధారితమైన వార్తలను అందించాలని సూచించారు. సంచలనాలకు ప్రాధాన్యత ఇవ్వకుండా సమాజానికి ఉపయోగపడే వార్తలను ప్రజలకు చేరవేయాలని, మీడియాపై ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలని పేర్కొన్నారు. మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ జర్నలిజం ప్రజల పక్షాన నిలవాలని, తప్పుడు సమాచారం వ్యాప్తి చెందుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో నైతిక విలువలు, వాస్తవ నిర్ధారణతో కూడిన వార్తా సేకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ప్రజాస్వామ్య బలోపేతంలో పత్రికల పాత్ర కీలకమని, జర్నలిస్టులు మీడియా చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ప్రొఫెసర్ కె. హరగోపాల్ మాట్లాడుతూ ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా పాత్రికేయ ప్రమాణాల పరిరక్షణలో కీలక పాత్ర పోషిస్తోందని, జర్నలిస్టులు వృత్తిపరమైన క్రమశిక్షణ, నిబద్ధతతో పనిచేయాలని పేర్కొన్నారు. శ్రీమతి పద్మజా మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ప్రకృతి వైపరీత్యాలపై ముందస్తు హెచ్చరికలను అందించడంలో మీడియా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, పోక్సో కేసుల్లో బాలల గోప్యతను కాపాడాలని సూచించారు. అమీర్ అలీఖాన్ మాట్లాడుతూ జర్నలిస్టులు నీతి, నిజాయితీతో పనిచేస్తూ వృత్తికి మంచి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు కె. రామచంద్రమూర్తి, మల్లెపల్లి లక్ష్మయ్య, ఎన్. వేణుగోపాల్, కె. సాజయ్య, టీయూడబ్ల్యూజే అధ్యక్షుడు కె. విరాహత్ అలీ, ప్రధాన కార్యదర్శి కె. రామ్ నారాయణ, మీడియా అకాడమీ కార్యదర్శి నాగులపల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో వ్యక్తమైన అభిప్రాయాలపై తెలుగు జర్నలిస్టు వెల్ఫేర్ అసోసియేషన్ (TJWA) జాతీయ ప్రధాన కార్యదర్శి శెట్టి వెంకటేష్ సానుకూలంగా స్పందిస్తూ ప్రత్యేక మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనను స్వాగతించారు. మారుతున్న మీడియా పరిస్థితులకు అనుగుణంగా జర్నలిస్టుల సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి సమగ్ర విధానాలు రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా గ్రామీణ, మండల, జిల్లా స్థాయిలో పనిచేస్తున్న జర్నలిస్టులకు ఉద్యోగ భద్రత, ఆరోగ్య బీమా, ప్రమాద బీమా, కుటుంబ సంక్షేమం, పిల్లల విద్య, గృహ వసతి వంటి అంశాల్లో తగిన ప్రాధాన్యత కల్పించాలని కోరారు. చిన్న, మధ్యతరహా పత్రికలు, డిజిటల్ మీడియా సంస్థలు ఎదుర్కొంటున్న సమస్యలను కూడా కమిషన్ అధ్యయనం చేయాలని సూచించారు. జర్నలిస్టుల హక్కుల పరిరక్షణతో పాటు వృత్తిపరమైన నైపుణ్యాభివృద్ధి, మీడియా స్వేచ్ఛ, వార్తల విశ్వసనీయతకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు. ప్రభుత్వం, మీడియా యాజమాన్యాలు, జర్నలిస్టు సంఘాలు సమన్వయంతో పనిచేస్తే పాత్రికేయ రంగాన్ని మరింత బలోపేతం చేయవచ్చని శెట్టి వెంకటేష్ అభిప్రాయపడ్డారు. జర్నలిస్టుల సంక్షేమం, వృత్తి గౌరవం, హక్కుల పరిరక్షణ, ఐక్యతే లక్ష్యంగా TJWA నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.

ఖేలో ఇండియా క్రీడల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి: ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు



హైదరాబాద్, నవంబర్ 16: తెలంగాణ రాష్ట్రంలో డిసెంబర్ 11 నుంచి 22వ తేదీ వరకు నిర్వహించనున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్-2026 జాతీయ స్థాయి క్రీడా పోటీలను విజయవంతం చేసేందుకు అన్ని జిల్లాల్లో పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లు, జీహెచ్ఎంసీ, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్లను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్లు, వివిధ శాఖల ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి క్రీడల నిర్వహణకు చేపట్టాల్సిన ఏర్పాట్లపై సమీక్షించారు. రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి జూమ్ ద్వారా ఈ సమావేశంలో పాల్గొని అధికారులకు పలు సూచనలు చేశారు. హైదరాబాద్‌తో పాటు హనుమకొండ, ఖమ్మం, కరీంనగర్, నిజామాబాద్, మహబూబ్‌నగర్ నగరాల్లో జరగనున్న ఈ జాతీయ స్థాయి క్రీడా పోటీలకు సుమారు 8 వేల మంది క్రీడాకారులు, ప్రతినిధులు హాజరుకానున్న నేపథ్యంలో రవాణా, వసతి, మౌలిక సదుపాయాల కల్పనలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు తీసుకోవాలని సీఎస్ స్పష్టం చేశారు. ఖేలో ఇండియా క్రీడలపై రాష్ట్రవ్యాప్తంగా విస్తృత ప్రచారం నిర్వహించాలని, ముఖ్యమైన కూడళ్లు, బహిరంగ ప్రదేశాల్లో హోర్డింగులు, బెలూన్ల ద్వారా క్రీడల మస్కట్, లోగోలను ప్రజలకు చేరువ చేయాలని సూచించారు. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం, సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ, కాజీపేట రైల్వే స్టేషన్లతో పాటు ప్రధాన బస్ స్టేషన్లలో ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. క్రీడల ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేసేందుకు టార్చ్ ర్యాలీలు నిర్వహించడంతో పాటు విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో భాగస్వాములయ్యేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. పోటీలు జరిగే క్రీడా వేదికల్లో అవసరమైన మౌలిక సదుపాయాలను ముందుగానే సిద్ధం చేయాలని, క్రీడాకారుల రాకపోకలకు ప్రత్యేక రవాణా సౌకర్యాలు కల్పించాలని, పాఠశాలల నుంచి విద్యార్థులను క్రీడా ప్రాంగణాలకు తీసుకువచ్చేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే క్రీడాకారులకు నాణ్యమైన వసతి, భోజన సదుపాయాలు కల్పించడంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థుల్లో క్రీడల పట్ల ఆసక్తి, అవగాహన పెంపొందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రముఖ క్రీడాకారులు, విశిష్ట వ్యక్తులు, మాజీ క్రికెటర్ మహమ్మద్ అజారుద్దీన్ వంటి క్రీడా ప్రముఖుల ద్వారా యువతకు ప్రేరణ కల్పించాలని సూచించారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా ఖేలో ఇండియా క్రీడల విశిష్టతను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని, యువతను క్రీడల వైపు ప్రోత్సహిస్తూ దేశ నిర్మాణంలో వారి భాగస్వామ్యాన్ని పెంపొందించేలా కృషి చేయాలని పేర్కొన్నారు. క్రీడల విజయవంతమైన నిర్వహణ రాష్ట్రానికి జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు తీసుకువచ్చేలా ప్రతి శాఖ సమన్వయంతో పనిచేయాలని, అప్పగించిన బాధ్యతలను సకాలంలో పూర్తి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర యువజన, క్రీడల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్, క్రీడల శాఖ ఎండీ సోని బాలాదేవి, సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ ముకుంద రెడ్డి, డైరెక్టర్ (మీడియా అండ్ కమ్యూనికేషన్స్) శ్రీరామ్ కర్ర, జీహెచ్ఎంసీ కమిషనర్, మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్, వివిధ జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా.. నవంబర్ 19న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభం



సూర్యాపేట జిల్లాలో ఈ పథకం ద్వారా మొత్తం 3,29,934 కుటుంబాలకు ప్రయోజనం చేకూరనుందని, ఇందులో గ్రామీణ ప్రాంతాలకు చెందిన 2,41,188 కుటుంబాలు, పట్టణ ప్రాంతాలకు చెందిన 88,746 కుటుంబాలు ఉన్నాయని వెల్లడించారు. పథకం అమలులో అధికారులు పూర్తి పారదర్శకత పాటించాలని, అర్హులైన కుటుంబాల వివరాలు, నామినీల నమోదును ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. వివరాల నమోదు పూర్తయిన అనంతరం వాటిని కుటుంబ సభ్యులకు చదివి వినిపించి, వారి అంగీకారం తీసుకున్న తర్వాతే ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు.

సూర్యాపేట, నవంబర్ 16: పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అమలు చేయనుందని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. ఈ నెల 19న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ పథకాన్ని ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమం అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, కుటుంబంలో సంపాదించే వ్యక్తి మరణించినప్పుడు ఆ కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా అందించడం ఈ పథకం ప్రధాన ఉద్దేశమని వివరించారు. కుటుంబంలో 18 నుంచి 59 ఏళ్ల వయస్సు కలిగిన అర్హులైన సంపాదనపరుల్లో ఒకరిని బీమా కోసం ఎంపిక చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. బీమా మొత్తానికి సంబంధించి నామినీలను, వారికి కేటాయించాల్సిన వాటాలను కూడా కుటుంబ సభ్యులే నిర్ణయించుకోవచ్చని పేర్కొన్నారు.



అర్హులైన పేదలందరికీ చేయూత పింఛన్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యం.. మంత్రి వివేక్ వెంకటస్వామి

నర్సాపూర్, నవంబర్ 16 (సందేశం టైమ్స్ ప్రతినిధి): అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం పాలన సాగిస్తోందని, అర్హులైన పేదలందరికీ చేయూత పింఛన్లు అందించి ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర కార్మిక, ఉపాధి, గనులు, భూగర్భ శాఖ మంత్రి, మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. సోమవారం నర్సాపూర్ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో నర్సాపూర్ నియోజకవర్గానికి చెందిన చేయూత పింఛన్ లబ్ధిదారులకు మంజూరు పత్రాలను మంత్రి వివేక్ వెంకటస్వామి, ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి, అదనపు కలెక్టర్ నగేష్‌తో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేదలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటోందని తెలిపారు. నర్సాపూర్ నియోజకవర్గ పరిధిలో మొత్తం 3,775 మంది లబ్ధిదారులకు రూ.88,14,400 విలువైన పింఛన్లు మంజూరైనట్లు వెల్లడించారు. ఇందులో చిలిపిచేడ్ మండలంలో 364 మంది, కౌడిపల్లి మండలంలో 598 మంది, కుల్చారం మండలంలో 548 మంది, మాసాయిపేట మండలంలో 263 మంది, నర్సాపూర్ మండలంలో 555 మంది, నర్సాపూర్ మున్సిపాలిటీలో 244 మంది, శివంపేట మండలంలో 720 మంది, వెల్దుర్తి మండలంలో 483 మంది లబ్ధిదారులు ఉన్నారని వివరించారు. వీరిలో 128 మంది కల్లుగీత కార్మికులు, 602 మంది దివ్యాంగులు, 2,635 మంది వితంతువులు, 366 మంది ఒంటరి మహిళలు ఉన్నారని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న చేయూత పింఛన్లు నిరుపేద కుటుంబాలకు ఎంతో ఆర్థిక భరోసాగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం బేస్‌మెంట్ స్థాయికి చేరుకున్న తర్వాత నిబంధనల ప్రకారం లబ్ధిదారులకు విడతల వారీగా బిల్లులు చెల్లించడం జరుగుతుందని తెలిపారు. నిరుపేద కుటుంబాలు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టేందుకు బ్యాంకులు రుణాలు అందించేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ప్రజా ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ పేదల అభ్యున్నతికి కృషి చేస్తోందని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి మాట్లాడుతూ వివిధ కార్పొరేషన్ల ద్వారా కార్లు, ట్రాక్టర్లు పొందిన అర్హులైన లబ్ధిదారులకు కూడా పింఛన్లు అందించేలా ప్రభుత్వం పరిశీలించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో శ్రీనివాసరావు, ఆర్డీవో రామకృష్ణ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసిని రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి రాజు యాదవ్, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మేడికుందలో 17 మందికి చేయూత పింఛన్లు మంజూరు.. లబ్ధిదారులకు ఉత్తర్వుల పత్రాల అందజేత



వట్పల్లి నవంబర్ 16 (సందేశం టైమ్స్ ప్రతినిధి): సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండల్ మేడికుంద గ్రామంలో ఎన్నో రోజులుగా చేయూత పింఛన్ల కోసం ఎదురుచూస్తున్న అర్హులైన లబ్ధిదారుల నిరీక్షణకు తెరపడింది. గ్రామానికి చెందిన 14 మంది వితంతువులు, ముగ్గురు దివ్యాంగులు కలిపి మొత్తం 17 మందికి నెలకు రూ.2,016 చొప్పున చేయూత పింఛన్లు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా లక్ష్మీదేవి గార్డెన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి దామోదర రాజనర్సింహా చేతుల మీదుగా లబ్ధిదారులకు పింఛన్ మంజూరు పత్రాలను అందజేశారు. ఈ పథకం సమాజంలోని బలహీన వర్గాలకు, నిరుపేదలకు ఆర్థిక, సామాజిక భద్రత కల్పించడంలో ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పలువురు పేర్కొన్నారు. ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్న తమకు పింఛన్లు మంజూరు కావడం పట్ల లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తూ మంత్రి దామోదర రాజనర్సింహకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి చరణ్‌రాజ్, ఆత్మ కమిటీ చైర్మన్ కచూర్ రావు, మాజీ ఎంపీటీసీ శంకరప్ప, యూత్ నాయకులు ప్రవీణ్ గౌడ్, పోచయ్య, విష్ణురావు, బోయిని ప్రవీణ్, డీలర్ ఏ. బేతయ్య తదితరులు పాల్గొన్నారు.



వట్‌పల్లిలో 11 మందికి చేయూత పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ

వట్‌పల్లి, నవంబర్ 16 (సందేశం టైమ్స్ ప్రతినిధి): అర్హులైన పేదలకు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం చేయూత పింఛన్లను మంజూరు చేస్తోందని తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ఆందోల్ నియోజకవర్గవ్యాప్తంగా నూతనంగా మంజూరైన చేయూత పింఛన్ల ఉత్తర్వుల పంపిణీ కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. ఇందులో భాగంగా వట్‌పల్లి గ్రామానికి చెందిన 11 మంది అర్హులైన లబ్ధిదారులకు మంత్రి తన చేతుల మీదుగా పింఛన్ మంజూరు పత్రాలను అందజేశారు. పింఛన్లు మంజూరైన వారిలో మాస్కురి విజయలక్ష్మి, ఎర్రోళ్ల స్వరూప, కంచరి ఆయేషా ఫాతిమా, కంచరి నూర్జహాన్ బేగం, ఎర్రోళ్ల రేనమ్మ, ఎర్రోళ్ల ప్రమీల, పట్లోళ్ల విజయలక్ష్మి, బాగ్లీ ఖైరున్నిసా బేగం, బొయిని సునీత, కలాలి వీరమణి, రంగా ఈశ్వరమ్మ ఉన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించి వారి జీవనానికి ఆర్థిక భరోసా కల్పించడమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్న తమకు పింఛన్లు మంజూరు కావడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు.

మంత్రి దామోదర్ రాజనర్సింహకు వివాహ ఆహ్వాన పత్రిక అందజేత



వట్పల్లి నవంబర్ 16 (సందేశం టైమ్స్ ప్రతినిధి): అందోల్ నియోజకవర్గ సోషల్ మీడియా కోఆర్డినేటర్ శ్రీకాంత్ తన సోదరుడి వివాహానికి హాజరుకావాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, శాస్త్ర సాంకేతిక శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి వివాహ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ నెల 18న నారాయణఖేడ్‌లోని సాయిబాబా ఫంక్షన్ హాల్‌లో, 19న వట్‌పల్లిలోని ఆర్.ఎస్. గార్డెన్‌లో నిర్వహించనున్న వివాహ వేడుకలకు మంత్రి దామోదర్ రాజనర్సింహను కుటుంబ సమేతంగా హాజరుకావాలని శ్రీకాంత్ ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి కుటుంబ సభ్యులతో కలిసి వివాహ వేడుకల్లో పాల్గొని వధూవరులను ఆశీర్వదించాలని కోరారు.

ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో పోలీస్ శాఖ.. శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం కృషి : డీఎస్పీ ప్రసన్న కుమార్





మద్దిరాల, నవంబర్ 16 (సందేశం టైమ్స్ సూర్యాపేట జిల్లా కోఆర్డినేటర్ సోమయ్య కంభంపాటి): ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణకు పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తోందని సూర్యాపేట డివిజన్ డీఎస్పీ ప్రసన్న కుమార్ అన్నారు. శనివారం రాత్రి సూర్యాపేట జిల్లా మద్దిరాల గ్రామంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా గ్రామంలోకి వచ్చే, వెళ్లే అన్ని మార్గాలను పోలీసుల ఆధీనంలోకి తీసుకుని ప్రతి ఇంటిని తనిఖీ చేశారు. అనుమానిత వ్యక్తుల వివరాలను పరిశీలించడంతో పాటు ఫింగర్ ప్రింట్ పరికరాల ద్వారా వేలిముద్రలను సేకరించి తనిఖీలు నిర్వహించారు. సరైన అనుమతి పత్రాలు, వాహన ధ్రువపత్రాలు లేని ద్విచక్ర వాహనాలు, కార్లను గుర్తించి సీజ్ చేశారు. ఈ ఆపరేషన్‌లో డీఎస్పీ ప్రసన్న కుమార్‌తో పాటు సీఐలు ఉపేందర్ రావు, నాగేశ్వరరావు, సర్కిల్ ఎస్సైలు నాగరాజు, క్రాంతికుమార్, వీరన్న తదితర ఎస్సైలు, సుమారు 80 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ గ్రామ ప్రజలతో మాట్లాడి భద్రతా చర్యలు, సామాజిక బాధ్యతలపై అవగాహన కల్పించారు. వాహనాలకు సరైన అనుమతి పత్రాలు, నంబర్ ప్లేట్లు తప్పనిసరిగా ఉండాలని, అవి లేకపోతే నేరాలు, ప్రమాదాలు జరిగినప్పుడు వాహనాలను గుర్తించడం, దర్యాప్తు చేయడం కష్టమవుతుందని తెలిపారు. నేరాల నియంత్రణలో ప్రజలు పోలీసులకు సహకరించాలని, గ్రామాల్లో సీసీ కెమెరాలను విస్తృతంగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. యువత చెడు వ్యసనాలకు, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, గ్రామాల్లోకి డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు రాకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. గ్రామాలకు కొత్తగా వచ్చే అపరిచిత వ్యక్తులకు ఆశ్రయం కల్పించే విషయంలో అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు లేదా 112 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రయాణ సమయంలో ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యాశకు లోనై వ్యక్తిగత, బ్యాంకు వివరాలను అపరిచితులకు వెల్లడించవద్దని హెచ్చరించారు. ఆధునిక పోలీసింగ్‌లో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని, ప్రజల సహకారంతోనే నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ సాధ్యమవుతుందని డీఎస్పీ ప్రసన్న కుమార్ పేర్కొన్నారు.



అందోల్-జోగిపేటలో చేయూత, ఒంటరి మహిళల పింఛన్ల పంపిణీ కార్యక్రమం

అందోల్, నవంబర్ 16 (సందేశం టైమ్స్ ప్రతినిధి): అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించి ఆర్థిక భరోసా కల్పించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. సోమవారం అందోల్-జోగిపేట మున్సిపాలిటీ పరిధిలో చేయూత, ఒంటరి మహిళల నూతన పింఛన్ లబ్ధిదారులకు సంబంధించిన పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి దామోదర రాజనర్సింహ, జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, మున్సిపల్ చైర్మన్ ఎస్. కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ ఆకుల సత్యనారాయణ (చిట్టిబాబు) హాజరయ్యారు. ఈ సందర్భంగా పింఛన్ లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పేదలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలకు ఆర్థికంగా అండగా నిలవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

తెలుగు జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ బైండ్ల కృష్ణ కుమారుని తొట్టెల కార్యక్రమంలో పాల్గొని ఆశీర్వదించిన వై. పండరి



మనూర్ మండల్ నవంబర్ 16 (సందేశం టైమ్స్ ప్రతినిధి): సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గం మానూర్ మండల పరిధిలోని బోరంచ గ్రామంలో తెలుగు జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ (TJWA) స్టేట్ వైస్ ప్రెసిడెంట్, ప్రపంచ మానవ హక్కుల అవగాహన సంఘం సంగారెడ్డి జిల్లా చైర్మన్ బైండ్ల కృష్ణ కుమారుని తొట్టెల కార్యక్రమం కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో ఘనంగా, ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నేషనల్ హ్యూమన్ రైట్స్ సోషల్ జస్టిస్ సోషల్ సర్వీస్ ఫర్ చేంజ్ ఆఫ్ ఇండియా రాష్ట్ర వైస్ చైర్మన్ వై. పండరి, జిల్లా ప్రధాన కార్యదర్శి అఖిల్, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ ప్రభాకర్, రిపోర్టర్ లక్ష్మణ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా చిన్నారిని ఆశీర్వదించి, బైండ్ల కృష్ణ కుటుంబ సభ్యులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. చిన్నారి ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఎదిగి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమానికి సంఘం ప్రతినిధులు హాజరుకావడంతో కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.



నిరుపేదల వైద్యానికి సీఎం సహాయనిధి అండ.. రూ.5 లక్షల విలువైన ఎల్ఓసీలు అందజేత

పటాన్‌చెరు, నవంబర్ 15 (సందేశం టైమ్స్ ప్రతినిధి బి. డేవిడ్): నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించడంతో పాటు వారికి ఆర్థికంగా అండగా నిలవడంలో ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతగానో తోడ్పడుతోందని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి (జీఎంఆర్) తెలిపారు. ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని చిట్కుల్ గ్రామానికి చెందిన కమ్మరి సుజాత, రామచంద్రాపురానికి చెందిన బండి సుజాతలు గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతూ మెరుగైన వైద్యం కోసం ఎమ్మెల్యే జీఎంఆర్‌ను సంప్రదించి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం అందించాలని దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు ప్రభుత్వం రూ.5 లక్షల విలువైన లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్ఓసీ)లను మంజూరు చేయగా, శనివారం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తన చేతుల మీదుగా బాధితుల కుటుంబ సభ్యులకు అనుమతి పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా సీఎం సహాయనిధి ద్వారా పేదలకు వైద్య ఖర్చుల భారం తగ్గించి మెరుగైన వైద్య సేవలు పొందేందుకు ప్రభుత్వం సహకరిస్తోందని ఆయన పేర్కొన్నారు.



సెయింట్ డాన్ బాస్కో పాఠశాలలో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు

జోగిపేట, నవంబర్ 15 (సందేశం టైమ్స్ ప్రతినిధి): జోగిపేటలోని సెయింట్ డాన్ బాస్కో ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో బాలల దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ వినోదభరిత ప్రదర్శనలతో తమ ప్రతిభను చాటుకున్నారు. చిన్నారుల ఆటపాటలు, ఆనందోత్సాహాల మధ్య పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది. ఈ సందర్భంగా పాఠశాల అడ్మినిస్ట్రేటర్ రెవ. ఫాదర్ ఎన్. సురేష్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థిలో ప్రత్యేక ప్రతిభ దాగి ఉంటుందని, దానిని గుర్తించి ప్రోత్సహించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, తల్లిదండ్రులపై ఉందని తెలిపారు. విద్యార్థులు చదువుతోపాటు క్రమశిక్షణ, మానవత్వం, నైతిక విలువలను అలవర్చుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జిన్సీ, సిస్టర్ అమల, ఇతర సిస్టర్స్, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు. బాలల దినోత్సవ వేడుకలు విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపాయి.

ఛట్ పూజ జాగరణ వేదిక మార్పు.. భక్తులు గమనించాలి: ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు, నవంబర్ 15 (సందేశం టైమ్స్ ప్రతినిధి బి. డేవిడ్): ఉత్తర భారతీయులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించుకునే ఛట్ పూజ సందర్భంగా ఆదివారం సాయంత్రం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని సాకి చెరువు కట్టపై నిర్వహించ తలపెట్టిన జాగరణ కార్యక్రమ వేదికను మైత్రి మైదానానికి మారుస్తున్నట్లు పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. భక్తులు ముందుగా సాకి చెరువు వద్ద సంప్రదాయబద్ధంగా పూజా కార్యక్రమాలు నిర్వహించుకుని, అనంతరం మైత్రి మైదానంలో జాగరణ కార్యక్రమంలో పాల్గొనాలని సూచించారు. సాకి చెరువు కట్టపై చలి తీవ్రత అధికంగా ఉండటంతో పాటు భక్తుల ఆరోగ్యానికి, భద్రతకు ఎలాంటి ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. కావున భక్తులందరూ వేదిక మార్పును గమనించి, సహకరించాలని ఆయన కోరారు.

నెహ్రూ ఆశయాలే దేశాభివృద్ధికి మార్గదర్శకాలు.. పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం: కన్నెబోయిన గోపి యాదవ్



చింతకాని, నవంబర్ 15 (సందేశం టైమ్స్ ప్రతినిధి): భారత తొలి ప్రధానమంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ఆశయాలు దేశాభివృద్ధికి మార్గదర్శకాలుగా నిలుస్తాయని చింతకాని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కన్నెబోయిన గోపి యాదవ్ అన్నారు. నెహ్రూ జయంతిని పురస్కరించుకుని నవంబర్ 14న చింతకాని మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గోపి యాదవ్ మాట్లాడుతూ ఆధునిక భారతదేశ నిర్మాణంలో, ప్రజాస్వామ్య పరిరక్షణలో జవహర్‌లాల్ నెహ్రూ చేసిన సేవలు చిరస్మరణీయమని, ఆయన ఆశయాలకు అనుగుణంగా సమాజంలోని అన్ని వర్గాల అభ్యున్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ సంక్షేమ పాలన అందిస్తోందని తెలిపారు. రాష్ట్రంలో వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, గీత కార్మికులు, చేనేత కార్మికులు తదితర అర్హులైన వర్గాలకు చెందిన సుమారు నాలుగున్నర లక్షల మందికి సామాజిక భద్రతా పింఛన్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. పేదలు, బలహీన వర్గాలకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ నెల 19న మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం 'ఇందిరా జీవిత బీమా' పథకాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మత్కేపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటి వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ నాయకులు కూరపాటి కిషోర్, బండెల నాగార్జున, నట్టు వెంకటేశ్వర్లు, ఇనుకుల్ల నాగసూరారెడ్డి, ఆలస్యం బసవయ్య, ఎన్.కె. కాసిం, పర్సగాని సతీష్, లింగం రాంబాబు, యడ్లపల్లి శ్రీనివాసరావు, శీలం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా.. నవంబర్ 19న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభం

సూర్యాపేట, నవంబర్ 16: పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అమలు చేయనుందని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తెలిపారు. ఈ నెల 19న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ పథకాన్ని ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమం అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, కుటుంబంలో సంపాదించే వ్యక్తి మరణిస్తే ఆ కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా అందించడం ఈ పథకం ప్రధాన ఉద్దేశమని వివరించారు. కుటుంబంలోని 18 నుంచి 59 ఏళ్ల వయస్సు కలిగిన అర్హులైన సంపాదనపరుల్లో ఒకరిని బీమా కోసం ఎంపిక చేసుకునే అవకాశం ఉందన్నారు. బీమా మొత్తానికి సంబంధించి నామినీలను, వారికి కేటాయించాల్సిన వాటాలను కూడా కుటుంబ సభ్యులే నిర్ణయించుకోవచ్చని పేర్కొన్నారు. సూర్యాపేట జిల్లాలో ఈ పథకం ద్వారా మొత్తం 3,29,934 కుటుంబాలకు ప్రయోజనం చేకూరనుందని, ఇందులో గ్రామీణ ప్రాంతాల్లో 2,41,188, పట్టణ ప్రాంతాల్లో 88,746 కుటుంబాలు ఉన్నాయని తెలిపారు. పథకం అమలులో అధికారులు పూర్తి పారదర్శకత పాటించాలని, అర్హులైన కుటుంబాల వివరాలు, నామినీల సమాచారాన్ని ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. వివరాల నమోదు అనంతరం వాటిని కుటుంబ సభ్యులకు చదివి వినిపించి, వారి అంగీకారం తీసుకున్న తర్వాతే ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌ను విజయవంతం చేయాలి.. రాష్ట్రవ్యాప్తంగా క్రీడా సందడి నింపాలి



సూర్యాపేట, నవంబర్ 16: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్–2026ను విజయవంతం చేసేందుకు అన్ని జిల్లాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర క్రీడలు, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి పిలుపునిచ్చారు. డిసెంబర్ 11 నుంచి 22వ తేదీ వరకు రాష్ట్రంలో ఈ జాతీయ స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సోమవారం హైదరాబాద్ నుంచి మంత్రి వాకిటి శ్రీహరి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, యువజనాభివృద్ధి, క్రీడల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎ. వాణీ ప్రసాద్, తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎ. సోనిబాలా దేవి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి క్రీడల నిర్వహణ, ప్రచార కార్యక్రమాలపై దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశానికి సూర్యాపేట జిల్లా సమీకృత కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని ఎనిమిది జిల్లాల్లో 20 వేదికలపై వివిధ క్రీడా పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, జాతీయ స్థాయి క్రీడా వేడుకలకు తెలంగాణ ఆతిథ్యం ఇవ్వడం రాష్ట్రానికి గర్వకారణమని పేర్కొన్నారు. ఈ క్రీడా వేడుకల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కూడా పాల్గొననున్నట్లు తెలిపారు. ఇప్పటికే న్యూఢిల్లీలో ముఖ్యమంత్రి ఖేలో ఇండియా యూత్ గేమ్స్ అధికారిక లోగో, మస్కట్‌ను ఆవిష్కరించిన నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. క్రీడలు జరిగే జిల్లాలతో పాటు మిగిలిన జిల్లాల్లోనూ ప్రజలు, విద్యార్థులు, యువతలో క్రీడలపై ఆసక్తి పెంచేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని కోరారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ రాష్ట్రంలోని 33 జిల్లాల్లో ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు పెద్దఎత్తున ప్రచారం కల్పించాలని కలెక్టర్లను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్లు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రధాన కూడళ్లు, బస్టాండ్లు, పార్కులు, ప్రజలు అధికంగా రాకపోకలు సాగించే ప్రాంతాల్లో అధికారిక లోగో, మస్కట్‌తో కూడిన పోస్టర్లు, ప్లెక్సీలు, హోర్డింగులు, కటౌట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. కలెక్టరేట్లలో కౌంట్‌డౌన్ బోర్డులు, ప్రధాన కూడళ్లలో మస్కట్ సెల్ఫీ పాయింట్లు ఏర్పాటు చేసి క్రీడా సంబరాల వాతావరణాన్ని తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల అధికారి వెంకటరెడ్డి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత.. ప్రత్యేక ప్రజావాణిలో 22 వినతుల స్వీకరణ



సూర్యాపేట, నవంబర్ 16: బాలల హక్కులను పరిరక్షించడంతో పాటు వారికి సురక్షితమైన జీవన వాతావరణాన్ని కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. బాలల సమస్యలను గుర్తించి వాటిని సత్వరమే పరిష్కరించేందుకు మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలల నుంచి మొత్తం 22 వినతులను అధికారులు స్వీకరించారు. కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ బాలలు తమ సమస్యలను ఎలాంటి భయం, సంకోచం లేకుండా స్వేచ్ఛగా అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. బాలల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కార మార్గాలు చూపించేందుకు ప్రజావాణి ప్రాంగణంలో ప్రత్యేక డెస్క్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం (డీసీపీయూ) సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్య, వైద్యం, పోషకాహారం, బాలల రక్షణ, మౌలిక సదుపాయాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలకు సంబంధించిన సమస్యలను బాలలు ప్రత్యేక డెస్క్ ద్వారా అధికారులకు నేరుగా వివరించారు. బాలలకు న్యాయం అందించడంలో సంబంధిత శాఖల అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, అందిన వినతులను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, డీఆర్వో ప్రేమ్ రాజు, జడ్పీ సీఈఓ శిరీష, డీఆర్డీఓ పీడీ సన్యాసయ్య, డీడబ్ల్యూఓ నరసింహారావు, బాలల సంరక్షణ అధికారి రవికుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



నర్సాపూర్‌లో స్కూల్ బస్సుకు తప్పిన పెను ప్రమాదం.. 35 మంది విద్యార్థులు క్షేమం

మెదక్, నవంబర్ 15 (సందేశం టైమ్స్ ప్రతినిధి): మెదక్ జిల్లా నర్సాపూర్‌లోని శ్రీ వత్సల్ గురుకుల పాఠశాలకు చెందిన స్కూల్ బస్సుకు పెను ప్రమాదం తప్పింది. బస్సు నడుపుతున్న సమయంలో డ్రైవర్ ప్రభాకర్‌కు అకస్మాత్తుగా ఫిట్స్ రావడంతో బస్సు అదుపుతప్పి ఫుట్‌పాత్ వైపు దూసుకెళ్లింది. ఈ ఘటనలో బస్సులో ప్రయాణిస్తున్న 35 మంది విద్యార్థులు తృటిలో ప్రమాదం నుంచి బయటపడి క్షేమంగా ఉన్నారు. అదుపుతప్పిన బస్సు ఫుట్‌పాత్ సమీపంలో నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనాలను ఢీకొట్టడంతో యాదగిరికి చెందిన ద్విచక్ర వాహనం పూర్తిగా ధ్వంసమైంది. అదే ప్రాంతంలో విద్యుత్ సరఫరా అవుతున్న రెండు ట్రాన్స్‌ఫార్మర్లు ఉండటంతో బస్సు వాటిని ఢీకొని ఉంటే ప్రమాద తీవ్రత మరింత పెరిగి ఉండేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ఒక్కసారిగా చోటుచేసుకున్న ఈ ఘటనతో విద్యార్థులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. డ్రైవర్‌కు అకస్మాత్తుగా ఫిట్స్ రావడమే ప్రమాదానికి కారణమని సమాచారం. విద్యార్థుల ప్రాణాలకు ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.



ద్విచక్ర వాహనంపై ఐదుగురు ప్రయాణం.. విద్యార్థులకు తల్లిదండ్రుల సమక్షంలో ట్రాఫిక్ పోలీసుల కౌన్సెలింగ్

సూర్యాపేట, నవంబర్ 15 (సందేశం టైమ్స్ జిల్లా కో ఆర్డినేటర్ సోమయ్య కంభంపాటి): ద్విచక్ర వాహనంపై ఐదుగురు విద్యార్థులు ప్రయాణిస్తున్న విషయాన్ని గుర్తించిన సూర్యాపేట పట్టణ ట్రాఫిక్ పోలీసులు వారిని అడ్డుకుని తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ యాదవేందర్ రెడ్డి విద్యార్థులకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఒకే ద్విచక్ర వాహనంపై పరిమితికి మించి ప్రయాణించడం అత్యంత ప్రమాదకరమని, ఇలాంటి నిర్లక్ష్యపు చర్యల వల్ల వాహనదారులతో పాటు రహదారిపై ప్రయాణించే ఇతరులు కూడా ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని తెలిపారు. మరోసారి ఇలాంటి ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలకు పాల్పడితే కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు వాహనాలు ఇచ్చే విషయంలో బాధ్యతగా వ్యవహరించాలని, ట్రాఫిక్ నిబంధనలపై వారికి అవగాహన కల్పించాలని సూచించారు. యువత, విద్యార్థులు సరదా కోసం చేసే నిర్లక్ష్యపు ప్రయాణాలు ప్రాణాల మీదకు తెస్తాయని, తమ ప్రాణాలతో పాటు ఎదుటివారి ప్రాణాలను కూడా ప్రమాదంలోకి నెట్టవద్దని ఎస్ఐ యాదవేందర్ రెడ్డి హితవు పలికారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యతని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించారు.

జయ పాఠశాలలో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు.. జాతీయ నాయకులు, దేవతామూర్తుల వేషధారణలో చిన్నారుల సందడి



సూర్యాపేట, నవంబర్ 15 (సందేశం టైమ్స్ జిల్లా కో ఆర్డినేటర్ సోమయ్య కంభంపాటి): భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని సూర్యాపేటలోని జయ పాఠశాలలో శనివారం బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల చిన్నారులు వివిధ జాతీయ నాయకులు, దేవతామూర్తుల వేషధారణలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. విద్యార్థులు జవహర్‌లాల్ నెహ్రూ, భారతమాత, తెలంగాణ తల్లి తదితరుల వేషధారణలో ముస్తాబై వేడుకలకు ప్రత్యేక శోభను తీసుకొచ్చారు. చిన్నారులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ జయ శేణుగోపాల్, డైరెక్టర్లు జెట్ల పద్మ, బింగి జ్యోతి విద్యార్థులను అభినందించారు. కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. వివిధ విభాగాల్లో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేసి ప్రోత్సహించారు. చిన్నారుల ఆటపాటలు, సాంస్కృతిక ప్రదర్శనలతో పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది.

తిరుమలాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు



శంకరంపేట, నవంబర్ 15 (సందేశం టైమ్స్): మెదక్ జిల్లా శంకరంపేట మండలం తిరుమలాపూర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో నవంబర్ 14 బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ చిన్నారులు, కిశోర బాలికలు, తల్లులు, గ్రామ ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బాలల దినోత్సవ ప్రాముఖ్యతను చిన్నారులకు వివరిస్తూ పలు కార్యక్రమాలు నిర్వహించారు. పిల్లల్లో విద్య, ఆరోగ్యం, క్రమశిక్షణ, పరిశుభ్రత, మంచి అలవాట్లపై అవగాహన కల్పించారు. చిన్నారుల ఆటపాటలు, సందడితో అంగన్‌వాడీ కేంద్రం సందడిగా మారి వేడుకలు ఆనందోత్సాహాల మధ్య కొనసాగాయి. ఈ సందర్భంగా ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య, పౌష్టికాహారం, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. బాలల సంతోషం, వారి సమగ్ర వికాసమే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి పునాది అని తెలిపారు.



ఓఆర్ఆర్ ఎగ్జిట్-2 వద్ద డ్రగ్స్ పట్టివేత.. బెంగళూరుకు చెందిన యువకుడు అరెస్ట్

పటాన్‌చెరు, నవంబర్ 15 (సందేశం టైమ్స్ ప్రతినిధి బి. డేవిడ్): సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు ఓఆర్ఆర్ ఎగ్జిట్-2 పరిధిలోని గద్దర్ సర్కిల్ సమీపంలో కొల్లూరు పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో ఎండీఎంఏ డ్రగ్స్ పట్టుబడ్డాయి. ఈ ఘటనకు సంబంధించి బెంగళూరుకు చెందిన గోసంగి వెంకట సాయి చరణ్ (27) అనే యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల వివరాల ప్రకారం నిందితుడి వద్ద నుంచి ఐదు గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్‌తో పాటు ఒక మొబైల్ ఫోన్, బలెనో కారును స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు బెంగళూరులో సుమారు రూ.12 వేల విలువైన డ్రగ్స్ కొనుగోలు చేసి, వాటిని హైదరాబాద్‌లో ఇద్దరు వ్యక్తులకు విక్రయించేందుకు తీసుకొచ్చినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైందని పోలీసులు తెలిపారు. పక్కా సమాచారంతో గద్దర్ సర్కిల్ సమీపంలో తనిఖీలు నిర్వహించి నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన కొల్లూరు పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, డ్రగ్స్ అక్రమ రవాణా, విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. డ్రగ్స్ సరఫరా, విక్రయాలపై నిరంతరం నిఘా కొనసాగిస్తూ అక్రమ కార్యకలాపాలకు అడ్డుకట్ట వేస్తామని స్పష్టం చేశారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఐఏఎస్ అధికారి రాజీవ్ హనుమంతుకు మంత్రి పొంగులేటి పరామర్శ

నవంబర్ 15 (సందేశం టైమ్స్): నెల్లూరు జిల్లా అనంతసాగరం మండలం చాపరాళ్లపల్లి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన తెలంగాణ రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖ ఐజీ, ఐఏఎస్ అధికారి రాజీవ్ హనుమంతును రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఫోన్‌లో పరామర్శించారు. తిరుమల నుంచి శ్రీశైలం వెళ్తున్న సమయంలో జరిగిన ఈ ప్రమాదంలో రాజీవ్ హనుమంతుతో పాటు ఆయన కుటుంబ సభ్యులు గాయపడిన విషయం తెలుసుకున్న మంత్రి వెంటనే స్పందించి ఫోన్ ద్వారా ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రమాదం జరిగిన తీరుతో పాటు కుటుంబ సభ్యులకు అయిన గాయాలు, ప్రస్తుతం అందుతున్న వైద్య చికిత్స వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాజీవ్ హనుమంతు కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పిన మంత్రి, ఎలాంటి ఆందోళన చెందవద్దని, మెరుగైన వైద్య సేవలు పొందాలని సూచించారు. తెలంగాణ ప్రభుత్వం తరఫున అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు. వైద్య చికిత్స విషయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. రాజీవ్ హనుమంతు, ఆయన కుటుంబ సభ్యులు త్వరగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆకాంక్షించారు.

అనాథ, నిరాశ్రయ చిన్నారులకు మెరుగైన భవిష్యత్తు కల్పించడమే లక్ష్యం

సూర్యాపేట, నవంబర్ 15 (సందేశం టైమ్స్ ప్రతినిధి): జాతీయ బాలల దినోత్సవం, భారతదేశ తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని సూర్యాపేట జిల్లా కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన బాల సదనం, శిశు గృహాలను జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ శనివారం లాంఛనంగా ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా తొమ్మిది జిల్లాల్లో ఏర్పాటు చేసిన శిశు గృహాలు, రెండు బాల సదనాలను రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) హైదరాబాద్ నుంచి వర్చువల్ విధానంలో ప్రారంభించగా, అందులో భాగంగా సూర్యాపేటలోని కేంద్రాలను కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నేటి బాలలే రేపటి భావి భారత పౌరులని, అనాథ, నిరాశ్రయ చిన్నారులకు మెరుగైన వసతి, విద్య, వైద్యం, సంరక్షణ అందించడంలో బాల సదనాలు, శిశు గృహాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. చిన్నారుల్లో దాగి ఉన్న సృజనాత్మకత, ప్రతిభ, నైపుణ్యాలను చిన్నప్పటి నుంచే గుర్తించి ప్రోత్సహించాలని సూచించారు. ఈ సందర్భంగా చిన్నారుల కోసం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి, మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ నరసింహ, అదనపు కలెక్టర్ హరి సింగ్, జిల్లా సంక్షేమ అధికారి నరసింహారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ నందిత, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ రమణారావు, కమిటీ సభ్యులు, జిల్లా బాలల పరిరక్షణ అధికారి రవికుమార్, బాల సదనం సూపరింటెండెంట్ అక్షిత, మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బంది, సఖీ కేంద్రం, మిషన్ శక్తి ప్రతినిధులు, బాల సదనం చిన్నారులు పాల్గొన్నారు.



సంగారెడ్డి పట్టణ అభివృద్ధికి పెద్దపీట.. రూ.55 లక్షలతో సీసీ రోడ్డు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శ్రీకారం

నవంబర్ 11 (సందేశం టైమ్స్ తెలంగాణ స్టేట్ కోఆర్డినేటర్ బి. సంగమేశ్వర్): సంగారెడ్డి పట్టణంలోని పలు వార్డుల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధే లక్ష్యంగా చేపట్టిన పనులకు మున్సిపల్ చైర్మన్ కూన వనిత సంతోష్ శ్రీకారం చుట్టారు. పట్టణంలోని 9వ వార్డు సప్తగిరి కాలనీలో రూ.45 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను, 35వ వార్డులో రూ.10 లక్షల వ్యయంతో చేపట్టనున్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంగారెడ్డి పట్టణంలోని ప్రతి వార్డులో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. ప్రారంభించిన పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు శ్రీలత శ్రీశైలం, నర్సమ్మ ప్రసాద్, సంగీత మహేష్, సతీష్ రెడ్డి, వంశీ, శైలేష్ రెడ్డి, రవి నాయక్, కాంగ్రెస్ నాయకులు సురేష్, కిరణ్, రమేష్‌తో పాటు వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇళ్లలో దీపావళి వెలుగుల సంబరాలు.. నిరుపేదలందరికీ సొంతింటి కల నెరవేర్చడమే లక్ష్యం: కాంగ్రెస్ నాయకులు

నవంబర్ 11 (సందేశం టైమ్స్ తెలంగాణ స్టేట్ కోఆర్డినేటర్ బి. సంగమేశ్వర్): సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గంలోని జిన్నారం మున్సిపాలిటీ కేంద్రంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారులతో కలిసి కాంగ్రెస్ పార్టీ నాయకులు దీపావళి సంబరాలు నిర్వహించారు. జిన్నారం 18వ వార్డు కౌన్సిలర్ ఎర్రవల్లి దీనా ప్రవీణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో లబ్ధిదారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొని ఆనందోత్సాహాల మధ్య పండుగను జరుపుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నిరుపేద కుటుంబాలకు సొంతింటి కలను నెరవేర్చేందుకు కృషి చేస్తోందని తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రతి నిరుపేద కుటుంబానికి సొంత ఇల్లు అందేలా తమ వంతు ప్రయత్నం కొనసాగిస్తామని, ఇల్లు లేదని ఏ ఒక్క పేద కుటుంబం ఆందోళన చెందకుండా ప్రభుత్వానికి నివేదిక అందించి అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శంకరయ్య, గోకర వెంకటేష్, పల్నాటి భాస్కర్, యనగండ్ల నరేందర్, వడ్ల నరేష్, అనిల్, లాలు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నవీన ఓణీల వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన లింగాల కమల్ రాజు



నవంబర్ 11 (సందేశం టైమ్స్) ఖమ్మం జిల్లా చింతకాని మండలం నాగులవంచ రైల్వే కాలనీలో కోపూరి నవీన్, కళ్యాణి దంపతుల కుమార్తె నవీన ఓణీల వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ శుభకార్యానికి మాజీ ఎమ్మెల్యే లింగాల కమల్ రాజు ముఖ్య అతిథిగా హాజరై చిన్నారి నవీనను ఆశీర్వదించి, కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చింతకాని మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ప్రస్తుత మరియు మాజీ సర్పంచులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పాల్గొని వేడుకను సందడిగా నిర్వహించారు.

రోడ్డు ప్రమాద బాధితులకు రూ.1.50 లక్షల వరకు నగదు రహిత వైద్యం.. పీఎం రహత్ పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి: నర్సాపూర్ ఎస్ఐ రంజిత్ రెడ్డి



నర్సాపూర్, నవంబర్ 10 (సందేశం టైమ్స్ ప్రతినిధి): రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన బాధితులకు ఆర్థిక ఇబ్బందుల కారణంగా వైద్య చికిత్స ఆలస్యం కాకుండా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం రహత్ పథకం ద్వారా గరిష్ఠంగా రూ.1.50 లక్షల వరకు నగదు రహిత వైద్య చికిత్స పొందవచ్చని నర్సాపూర్ సబ్ ఇన్‌స్పెక్టర్ రంజిత్ రెడ్డి తెలిపారు. ఈ పథకం కింద ప్రమాదం జరిగిన తేదీ నుంచి గరిష్ఠంగా ఏడు రోజుల వరకు వైద్య చికిత్స పొందే అవకాశం ఉందని, బాధితుల ఆదాయంతో సంబంధం లేకుండా పథకం నిబంధనల ప్రకారం అర్హులైన వారికి ఈ సదుపాయం వర్తిస్తుందని వివరించారు. జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులు, పట్టణ, గ్రామీణ రహదారులపై జరిగే మోటారు వాహన ప్రమాదాల్లో గాయపడిన వారికి గుర్తింపు పొందిన ఆసుపత్రుల్లో నగదు రహిత చికిత్స అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే అత్యవసర సహాయం కోసం 112కు ఫోన్ చేయాలని, క్షతగాత్రులను వీలైనంత త్వరగా సమీపంలోని పీఎం రహత్ పథకం పరిధిలోని గుర్తింపు పొందిన ఆసుపత్రికి తరలించాలని సూచించారు. ఆసుపత్రి సిబ్బందికి పీఎం రహత్ పథకం కింద వైద్య చికిత్స అందించాలని తెలియజేయాలని కోరారు. రోడ్డు ప్రమాద బాధితులకు సహాయం చేయడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని, డబ్బుల సమస్యతో ఎవరూ వైద్య చికిత్సకు దూరం కాకూడదనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. ఈ పథకంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని, కుటుంబ సభ్యులు, స్నేహితులు, గ్రామ ప్రజలు, వాట్సాప్ గ్రూపుల ద్వారా సమాచారాన్ని ప్రచారం చేయాలని ఎస్ఐ రంజిత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ప్రతి ఒక్కరి అప్రమత్తత మరొకరి ప్రాణాలను కాపాడగలదని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.



వెలుగుమట్ల మోడల్ కాలనీలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి.. నవంబర్ నెలాఖరుకు అన్ని పనులు పూర్తి కావాలి: కలెక్టర్ దివాకర టి.ఎస్

నవంబర్ 11 (సందేశం టైమ్స్ ఖమ్మం జిల్లా ఇంచార్జ్ శెట్టి సురేష్) ఖమ్మం నగరపాలక సంస్థ పరిధిలోని వెలుగుమట్ల మోడల్ కాలనీలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలతో పాటు మౌలిక సదుపాయాల పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అధికారులను ఆదేశించారు. ఖమ్మం నగరపాలక సంస్థ 15వ డివిజన్ పరిధిలోని వెలుగుమట్ల మోడల్ కాలనీని ఆయన క్షేత్రస్థాయిలో సందర్శించి ఇళ్ల నిర్మాణాల పురోగతిని, అంతర్గత రహదారులు, డ్రైనేజీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మాణాల ప్రస్తుత స్థితిగతులను అధికారులను అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. కాలనీలో మొత్తం 300 ఇందిరమ్మ ఇళ్లకు మంజూరు లభించిందని, క్షేత్రస్థాయి నివేదిక ప్రకారం ఇప్పటివరకు 22 ఇళ్ల నిర్మాణాలు పూర్తయి ఫినిషింగ్ దశకు చేరుకున్నాయని తెలిపారు. మరో 119 ఇళ్లకు స్లాబ్ పనులు పూర్తయ్యాయని, 59 ఇళ్లు రూఫ్ లెవల్‌లో ఉండగా, 98 ఇళ్లు బేస్‌మెంట్ స్థాయిలో ఉన్నాయని వివరించారు. మిగిలిన నిర్మాణ పనులను కూడా వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు.

లబ్ధిదారుల ఖాతాల్లో ప్రతి సోమవారం నిధుల జమ

ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి లబ్ధిదారులకు ఆర్థిక ఇబ్బందులు తలెత్తకుండా నిర్మాణ దశను బట్టి ప్రతి సోమవారం నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో ప్రభుత్వం నిధులు జమ చేస్తోందని కలెక్టర్ తెలిపారు. ఇప్పటివరకు వివిధ నిర్మాణ దశల్లో ఉన్న 205 ఇళ్లకు సంబంధించి చెల్లింపులు పూర్తయ్యాయని, మిగిలిన పెండింగ్ బిల్లులను కూడా త్వరితగతిన విడుదలయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. నిర్మాణాల వేగాన్ని మరింత పెంచేందుకు 133 మంది లబ్ధిదారులకు స్వయం సహాయక సంఘాల ద్వారా రుణాలు అందించినట్లు వెల్లడించారు. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకునేలా అధికారులు నిరంతరం సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు.

రోడ్లు, డ్రైనేజీ, విద్యా, వైద్య సదుపాయాలపై ప్రత్యేక దృష్టి

మోడల్ కాలనీలో నివసించే ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు నిర్మిస్తున్న బస్తీ దవాఖానా, ప్రభుత్వ పాఠశాల, అంగన్వాడీ కేంద్రాల భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. కాలనీలో అంతర్గత సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ నిర్మాణ పనులు ప్రస్తుతం పురోగతిలో ఉన్నాయని, వాటిని కూడా త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. నవంబర్ నెలాఖరు నాటికి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలతో పాటు అన్ని మౌలిక సదుపాయాల పనులు పూర్తి చేసి వెలుగుమట్ల మోడల్ కాలనీని ఆదర్శ కాలనీగా తీర్చిదిద్దాలని స్పష్టం చేశారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాల విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని, ఇంజనీరింగ్ అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపట్టాలని దిశానిర్దేశం చేశారు. కలెక్టర్ పర్యటనలో హౌసింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, డీఈ కె. జగ్రామ్, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ డీఈ నవ్యజ్యోతి, ఖమ్మం అర్బన్ తహసీల్దార్ జయచంద్ర, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



పేరెంట్–టీచర్ సమావేశానికి హాజరై విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్న సర్పంచ్ బంజ లావణ్య రవి

వెల్దుర్తి, నవంబర్ 11 (సందేశం టైమ్స్ ప్రతినిధి): మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం శేరిల్లా గ్రామంలో నిర్వహించిన పేరెంట్–టీచర్ సమావేశానికి గ్రామ సర్పంచ్ బంజ లావణ్య రవి హాజరై విద్యార్థుల సమస్యలు, పాఠశాలలో అందుతున్న సౌకర్యాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న విద్యాబోధన, మధ్యాహ్న భోజనం, ఉదయం అందించే అల్పాహారం తదితర అంశాలపై విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారం అందించడం ఎంతో ముఖ్యమని ఆమె పేర్కొన్నారు. పాఠశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, వారికి అవసరమైన సౌకర్యాల గురించి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో చర్చించారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల సంక్షేమానికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ అందిస్తానని సర్పంచ్ బంజ లావణ్య రవి తెలిపారు.



అనంతసాగర్‌లో నూతన గృహ ప్రవేశ వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే చింత ప్రభాకర్...

నవంబర్ 11 (సందేశం టైమ్స్) తెలంగాణ స్టేట్ కోఆర్డినేటర్ బి.సంగమేశ్వర్).సంగారెడ్డి జిల్లా అనంతసాగర్ గ్రామంలో కుమార్ నూతనంగా నిర్మించుకున్న ఇంటి గృహ ప్రవేశ కార్యక్రమానికి సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన గృహంలోకి అడుగుపెట్టిన కుమార్ కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేసి, వారు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.అనంతరం గ్రామ సర్పంచ్ నివాసానికి వెళ్లిన ఎమ్మెల్యే చింత ప్రభాకర్‌ను సర్పంచ్ కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆత్మీయంగా స్వాగతించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను సర్పంచ్ ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధి, ప్రజా సమస్యలు, స్థానిక పరిస్థితులపై నాయకులు పరస్పరం చర్చించుకున్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామాభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చేయూత పింఛన్లు, రాజీవ్ యువ వికాసం పథకాలకు వెంటనే నిధులు మంజూరు చేయాలి



సంగారెడ్డి, నవంబర్ 11 (సందేశం టైమ్స్) మెదక్ జిల్లా ఇన్‌చార్జి అనిల్ కుమార్): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చేయూత పింఛన్లు, రాజీవ్ యువ వికాసం పథకాలకు నిధులు మంజూరు చేసి అర్హులైన లబ్ధిదారులకు పింఛన్లు, స్వయం ఉపాధి రుణాలు అందించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రభుగౌడ్ డిమాండ్ చేశారు. గురువారం సంగారెడ్డి జిల్లా బీసీ సంక్షేమ సంఘం కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలకు వెంటనే నిధులు విడుదల చేయాలని కోరారు. అదేవిధంగా నిరుపేదలకు ఇంటి స్థలాలు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి బీసీ సంక్షేమ సంఘం నిరంతరం కృషి చేస్తుందని, రాబోయే రోజుల్లో ప్రజా సమస్యలపై ఉద్యమాలు చేపట్టి పోరాటం కొనసాగిస్తామని ప్రభుగౌడ్ స్పష్టం చేశారు. జిల్లా బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పట్టోళ్ల మల్లికార్జున పాటిల్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ అధ్యక్షుడు, మాజీ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు ప్రభుగౌడ్, ఉపాధ్యక్షుడు డి. కిష్టయ్య, ప్రధాన కార్యదర్శులు పార్వతి కృష్ణ, నాగరాణి, జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు కె. అంజనేయులు, ప్రధాన కార్యదర్శి జె. రాజేశ్వర్ స్వామి, కోశాధికారి సుధాకర్ గౌడ్, ఉపాధ్యక్షులు శ్రీధర్, మహేందర్, ముఖ్య సలహాదారు కరంజిత్ సింగ్, కార్యదర్శులు గౌలీశ్వర్, శ్రీనివాస్, ప్రవీణ్, మహేష్, సభ్యులు యాదగిరి, రవీందర్ పాల్గొన్నారు. అలాగే యూత్ కమిటీ అధ్యక్షుడు జావిద్, మహిళా కమిటీ అధ్యక్షురాలు మంజుల గౌడ్, కార్యనిర్వాహక అధ్యక్షురాలు మానస, కార్యదర్శి వీరమణి, సదాశివపేట మండల అధ్యక్షురాలు మౌనిక తదితరులు పాల్గొన్నారు.



పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్న ప్రజాప్రభుత్వం – శేరి వెంకట్ రెడ్డి, మొరబోయిన కృష్ణ

అందోల్, నవంబర్ 11 (సందేశం టైమ్స్ ప్రతినిధి) సంగారెడ్డి జిల్లా అందోల్ మండల్ లో పేదల సొంతింటి కలను సాకారం చేస్తూ వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపడమే ప్రజాప్రభుత్వ లక్ష్యమని మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ శేరి వెంకట్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు మొరబోయిన కృష్ణ అన్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సి. దామోదర్ రాజనర్సింహా ఆదేశాల మేరకు ప్రభుత్వం నిర్వహిస్తున్న 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమంలో భాగంగా ఆదివారం అందోల్ మండలం కంసాన్‌పల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారు చాకలి లక్ష్మి రవి నివాసంలో దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారు కుటుంబ సభ్యులతో కలిసి ఇంటి ముందు దీపాలు వెలిగించి, ఇంటికి ప్రత్యేక స్టిక్కర్ అంటించి, గ్రూప్ ఫొటోలు దిగారు. తమ సొంతింటిలో తొలిసారిగా దీపావళి పండుగ జరుపుకోవడం పట్ల లక్ష్మి రవి కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శేరి వెంకట్ రెడ్డి, మొరబోయిన కృష్ణ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేద కుటుంబాలకు సొంతింటి కల నెరవేరుతోందని, నూతన గృహాల్లో దీపాలు వెలిగించి పండుగ జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. పేదల జీవితాల్లో సంతోషం, భద్రత, కొత్త ఆశలు నింపడమే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. అనంతరం లబ్ధిదారు కుటుంబ సభ్యులతో కలిసి దీపాలు వెలిగించి, టపాసులు కాల్చి దీపావళి సంబరాల్లో ఉత్సాహంగా పాల్గొని కుటుంబ సభ్యులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బాలయ్య, వార్డు సభ్యులు వని రమాదేవి, దుర్గయ్య, మాజీ వార్డు సభ్యుడు మొరబోయిన లక్ష్మిదత్తు, నాయకులు మొరబోయిన ఈశ్వరయ్య, మన్నే దత్తయ్య, రామన్నగారి చంద్రయ్య, రామన్నగారి కిష్టయ్య, చాకలి యాదయ్య, చాకలి ఆశయ్య, చాకలి ఈశ్వర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

బస్సు ఎక్కే క్రమంలో ప్రమాదం.. వ్యక్తి కాళ్లపై నుంచి వెళ్లిన వెనుక చక్రాలు





మెదక్ , నవంబర్ 11 (సందేశం టైమ్స్ ప్రతినిధి) మెదక్ జిల్లా లో దుంపలకుంట ఎక్స్ రోడ్డు చౌరస్తా వద్ద బస్సు ఎక్కే క్రమంలో ఓ వ్యక్తి ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడిన ఘటన చోటుచేసుకుంది. మెదక్ నుంచి పటాన్‌చెరు వెళ్తున్న ఆర్టీసీ బస్సు వద్ద ప్రయాణికుడు ఎక్కేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో అదుపుతప్పి కింద పడిపోయాడు. ఈ క్రమంలో బస్సు వెనుక చక్రాలు అతని కాళ్లపై నుంచి వెళ్లడంతో కాళ్లు తీవ్రంగా నుజ్జునుజ్జయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు పెద్దగా కేకలు వేస్తూ బస్సును ఆపాలని డ్రైవర్‌ను హెచ్చరించినప్పటికీ డ్రైవర్ వెంటనే స్పందించకుండా ముందుకు వెళ్లినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. దీంతో కొంతదూరం వెళ్లిన తర్వాత స్థానికులు బస్సును ఆపి డ్రైవర్‌ను నిలదీశారు. అనంతరం స్థానికులు అంబులెన్స్‌కు సమాచారం అందించగా, సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వ్యక్తితో పాటు బస్సు డ్రైవర్‌ను ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వ్యక్తి జోగిపేటకు చెందినవాడిగా గుర్తించినట్లు స్థానికులు తెలిపారు. ప్రమాదానికి బస్సు డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమని ప్రత్యక్ష సాక్షులు ఆరోపిస్తున్నారు.

MDR ఫౌండేషన్ కార్యాలయంలో ఘనంగా దీపావళి వేడుకలు



పటాన్‌చెరు, నవంబర్ 11 (సందేశం టైమ్స్ స్టేట్ కోఆర్డినేటర్): దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని పటాన్‌చెరు పట్టణంలోని MDR ఫౌండేషన్ కార్యాలయంలో లక్ష్మీ పూజ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, MDR ఫౌండేషన్ కో-ఫౌండర్ మాద్రి పృథ్వీరాజ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు కలగాలని అమ్మవారిని ప్రార్థించారు. అనంతరం మాద్రి పృథ్వీరాజ్ మాట్లాడుతూ దీపావళి పండుగ చీకటిపై వెలుగు, చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక అని, ప్రతి ఒక్కరి జీవితాల్లో ఆశ, ఆనందం, ప్రేమ, ఐకమత్యం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ ఆనందోత్సాహాలతో పాటు సురక్షితంగా దీపావళి వేడుకలను జరుపుకోవాలని కోరారు. ఈ సందర్భంగా పటాన్‌చెరు నియోజకవర్గ ప్రజలతో పాటు తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాద్రి దేవేందర్ రాజు, ప్రవీణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సంగారెడ్డిలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల ముఖ్య సమావేశం.. హాజరుకానున్న జగ్గారెడ్డి, నిర్మలా జగ్గారెడ్డి



సంగారెడ్డి, నవంబర్ 11(సందేశం టైమ్స్ ప్రతినిధి): సంగారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులతో ఈ నెల 11వ తేదీ బుధవారం సాయంత్రం 4 గంటలకు సంగారెడ్డి చౌరస్తాలోని పి.ఎస్.ఆర్. గార్డెన్స్‌లో ముఖ్య సమావేశం నిర్వహించనున్నట్లు టీం జగ్గారెడ్డి వెల్లడించింది. ఈ సమావేశానికి టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, నిర్మలా జగ్గారెడ్డి పాల్గొననున్న నేపథ్యంలో నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని టీం జగ్గారెడ్డి కోరింది.





రామకృష్ణాపురంలో ఎమ్మెస్ఎఫ్ గ్రామ కమిటీ ఎన్నిక.. అధ్యక్షుడిగా పగిడిపల్లి అభి ఏకగ్రీవ ఎన్నిక

చింతకాని, నవంబర్ 11 (సందేశం టైమ్స్ చింతకాని ప్రతినిధి): ఖమ్మం జిల్లా చింతకాని మండలం రామకృష్ణాపురం గ్రామంలో మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ (ఎమ్మెస్ఎఫ్) గ్రామ కమిటీ ఎన్నికలు నిర్వహించారు. గ్రామంలోని పాత కాలనీలో గుంటి అరవింద్ అధ్యక్షతన, కొత్త కాలనీలో గద్దల మహేష్ అధ్యక్షతన జరిగిన సమావేశాలకు ఎమ్మెస్ఎఫ్ జిల్లా నాయకులు పగిడిపల్లి రవీంద్ర, చిర్రా ఉపేందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవిష్యత్తులో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఎమ్మెస్ఎఫ్ గుండెకాయగా నిలవాలని, పీడిత కులాల గొంతుకగా మారి అణగారిన వర్గాల విద్యార్థులకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. అవసరమైతే కృష్ణ మాదిగ స్ఫూర్తితో ఎంతటి త్యాగాలకైనా సిద్ధంగా ఉండాలని అన్నారు. అనంతరం నిర్వహించిన గ్రామ కమిటీ ఎన్నికల్లో అధ్యక్షుడిగా పగిడిపల్లి అభిని ఏకగ్రీవంగా ఎన్నుకోగా, కమిటీ సభ్యులుగా గుడిపాటి యశ్వంత్, గుర్రం రక్షిత, బొప్పి భార్గవి, గుంటి త్రివేన్, పగిడిపల్లి మాధవి, గుంటి శ్రీనివాస్, భరత్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెస్ఎఫ్ మండల అధ్యక్షుడు నారపోగు నాగేంద్రబాబు, కుక్కల దిలీప్, గ్రామ పెద్దలు పగిడిపల్లి వసంతరావు, రాయలమీర స్వామి, బుర్ర జయరాజు, పగిడిపల్లి పెద్ద బాలస్వామి, సోదరుల నాగేంద్రం, గుర్రం లాలు, గుంటి హుస్సేన్‌తో పాటు యువజన సభ్యులు గుడిపాటి గోపి, పగిడిపల్లి సాయి తేజ, ఏంపంగి బాలకృష్ణ, పగిడిపల్లి తేజ, బుర్ర ప్రేమ్ కుమార్, గద్దల అశోక్, పగిడిపల్లి గోపి, గుడిపాటి అరవింద్, పగిడిపల్లి నాగమణి, పగిడిపల్లి వీరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పేరబోయిన గూడెం ఇసుక రీచ్ అక్రమాలను వెంటనే అరికట్టాలి.. చిత్తలూరు గ్రామ ఇసుక రీచ్ కమిటీ డిమాండ్



సూర్యాపేట, నవంబర్ 11 (సందేశం టైమ్స్ సూర్యాపేట జిల్లా కోఆర్డినేటర్ సోమయ్య కంభంపాటి): నాగారం మండలం పేరబోయిన గూడెం ఇసుక రీచ్‌లో జరుగుతున్న అక్రమాలను వెంటనే అరికట్టి, సూర్యాపేట జిల్లా పేరబోయిన గూడెం, నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం చిత్తలూరు గ్రామాల మధ్య ఇసుక రీచ్ సరిహద్దులను స్పష్టంగా నిర్ణయించాలని నల్లగొండ జిల్లా శాలిగౌరారం మార్కెట్ కమిటీ చైర్మన్ పాదూరు శంకర్ రెడ్డి, చిత్తలూరు గ్రామ సర్పంచ్ గిరగాని వెంకన్న, గ్రామ ఇసుక రీచ్ కమిటీ అధ్యక్షుడు భీమగాని వెంకన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు చిత్తలూరు గ్రామ ఇసుక రీచ్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం సూర్యాపేట జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి, అనంతరం ప్రజావాణిలో అదనపు కలెక్టర్ బి. హరి సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పేరబోయిన గూడెం గ్రామానికి చెందిన కొందరు చిత్తలూరు గ్రామ సరిహద్దుల్లోకి వచ్చి ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలిస్తున్నారని, దీనివల్ల భూగర్భ జలాలు అడుగంటిపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై గతంలో ఆర్డీఓ, మైనింగ్ శాఖ అధికారులకు వినతిపత్రాలు అందజేసినా పరిష్కారం లభించలేదని తెలిపారు. రెండు గ్రామాల మధ్య వివాదాలు మరింత తీవ్రరూపం దాల్చకుండా జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి ఇసుక రీచ్ సరిహద్దులను నిర్ణయించి తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చిత్తలూరు గ్రామ ఉపసర్పంచ్ యన్నమల్ల శంకర్, మాజీ సర్పంచ్ బొమ్మగాని రవి, కోఆప్షన్ సభ్యులు దాసరి దేవచిత్త, సుంకరి వినీత్, చిలువేరు కిరణ్, యర్ర లక్ష్మి, రాచమల్ల సైదమ్మ, శంభయ్య, తేలుకుంట్ల జయమ్మ, పీరనాయకం జ్యోతి, నరేష్‌తో పాటు చిత్తలూరు గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.



ప్రజా ఫిర్యాదులపై వేగంగా స్పందించి సమస్యలను పరిష్కరించాలి.. జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్

సూర్యాపేట, నవంబర్ 11 (సందేశం టైమ్స్ సూర్యాపేట జిల్లా కోఆర్డినేటర్ సోమయ్య కంభంపాటి): సూర్యాపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్ డే కార్యక్రమంలో జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ జిల్లా నలుమూలల నుంచి వివిధ సమస్యలపై వచ్చిన ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. బాధితులు అందించిన వినతులను పరిశీలించి, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై పోలీసులు తక్షణమే స్పందించాలని, సమస్యలను త్వరితగతిన పరిష్కరించి బాధితులకు భరోసా కల్పించాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. ప్రజలకు అవసరమైన పోలీస్ సేవలు అందించడంతో పాటు వారి సమస్యల పరిష్కారానికి పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ప్రజల రక్షణ కోసం పోలీసు సిబ్బంది అనుక్షణం విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలు గొడవలు, తగాదాలకు దూరంగా ఉండాలని, ఏవైనా సమస్యలు తలెత్తినప్పుడు దాడులకు పాల్పడకుండా ఇరు వర్గాలు పెద్దల సమక్షంలో సామరస్యపూర్వకంగా, చట్ట పరిధిలో సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారానికి పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని ఎస్పీ స్పష్టం చేశారు.

సాయం చేయాలనే మంచి మనసుంటే కుల, మత, ప్రాంత భేదాలు అడ్డుకావు.. ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడమే నిజమైన మానవత్వం



సూర్యాపేట, నవంబర్ 11 (సందేశం టైమ్స్ సూర్యాపేట జిల్లా కోఆర్డినేటర్ సోమయ్య కంభంపాటి): కుల, మత, ప్రాంత భేదాలు చూడకుండా ఆపదలో ఉన్నవారికి సాయం చేయాలనే మంచి మనసు ఉంటే చాలు, మానవత్వం ఎప్పుడూ మనిషిని ముందుండి నడిపిస్తుందని సూర్యాపేట జిల్లా కోఆర్డినేటర్ సోమయ్య కంభంపాటి పేర్కొన్నారు. గుంటూరు జిల్లా తెనాలికి చెందిన కార్తీక్ తన తల్లిదండ్రులతో కలిసి కారులో తెనాలి నుంచి హైదరాబాద్‌కు ప్రయాణిస్తుండగా, సూర్యాపేట జిల్లా కోదాడ నియోజకవర్గంలోని బరాఖత్ గూడెం సమీపంలో జాతీయ రహదారిపై కారు మరమ్మతుకు గురై నిలిచిపోయింది. అదే మార్గంలో వెళ్తున్న సోమయ్య కంభంపాటి మొదట కారును గమనించినప్పటికీ, కొంతసేపటి తర్వాత తిరిగి అదే మార్గంలో వస్తున్న సమయంలో కారు ఇంకా అక్కడే నిలిచి ఉండటాన్ని గుర్తించి, వెళ్లి ఏమైందని అడిగి తెలుసుకున్నారు. కారు మరమ్మతుకు గురైందని వారు చెప్పడంతో కార్తీక్‌ను తన స్కూటీపై తీసుకెళ్లి సమీపంలోని మెకానిక్ షాపుల వద్ద ప్రయత్నించారు. ఆ సమయంలో మెకానిక్‌లు అందుబాటులో లేకపోవడంతో కోదాడలోని మెకానిక్‌కు ఫోన్ చేసి రప్పించారు. మెకానిక్ వచ్చి కారును కోదాడలోని గ్యారేజీకి తీసుకెళ్లగా, కారు మరమ్మతు పూర్తయ్యే వరకు సోమయ్య వారితోనే ఉండి, మరమ్మతు బిల్లును సైతం చెల్లించి, అనంతరం వారిని హైదరాబాద్ వెళ్లే జాతీయ రహదారి మార్గం వరకు తీసుకెళ్లి సురక్షితంగా పంపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు కార్తీక్‌తో గతంలో ఎలాంటి పరిచయం లేదని, కనీసం ముఖ పరిచయం కూడా లేకపోయినా ఆపదలో ఉన్నవారికి సాయం చేయాలనే ఆలోచనతో ముందుకు వచ్చానని తెలిపారు. నేటి సమాజంలో చాలామంది ఇతరుల సమస్యలను పట్టించుకోకుండా తమ పని తాము చూసుకుంటూ వెళ్లిపోతున్న పరిస్థితుల్లో, తోటి మనిషికి అవసరమైన సమయంలో అండగా నిలవడం ఎంతో ముఖ్యమని అన్నారు. మనిషి జీవితం ఎప్పుడు ఎలా ముగుస్తుందో ఎవరికీ తెలియదని, మనం చేయగలిగిన సాయాన్ని మాత్రం తప్పకుండా చేయాలని సూచించారు. సాయం పొందేవారు మనకు తెలిసినవారా, తెలియనివారా, మన ప్రాంతం వారా, ఇతర ప్రాంతాల వారా అనే భేదాలు చూడకుండా మానవత్వంతో స్పందించాలని, ఆశించకుండా చేసే సాయం ఏదో ఒక రూపంలో తిరిగి మనకే మంచిని కలిగిస్తుందని ఆయన పేర్కొన్నారు.

ప్రజాసేవకుల సేవలకు గుర్తింపు ఇవ్వడం అభినందనీయం.. అవార్డు కార్యక్రమంపై మన్నే పోచయ్య ప్రశంసలు



మునిపల్లి, నవంబర్ 11 (సందేశం టైమ్స్ ప్రతినిధి): ప్రజాసేవలో విశేష కృషి చేస్తున్న నాయకులను గుర్తించి సత్కరించేందుకు సంస్థ, దాని వ్యవస్థాపకులు ఒగ్గు సతీష్ సోదరులు నిర్వహిస్తున్న అవార్డుల కార్యక్రమం అభినందనీయమని సందేశం టైమ్స్ విలేకరి మన్నే పోచయ్య అన్నారు. ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్న నాయకుల సేవలను గుర్తించి తగిన గౌరవం అందించే వేదికలు అరుదుగా ఉంటాయని, అలాంటి గొప్ప ఆలోచనతో అవార్డుల కార్యక్రమాన్ని నిర్వహించడం సంతోషకరమని పేర్కొన్నారు. ఈ అవార్డుల ద్వారా ప్రజాసేవకులను సత్కరించడమే కాకుండా, మరింత బాధ్యతతో ప్రజలకు సేవ చేయాలనే స్ఫూర్తిని అందిస్తున్నారని తెలిపారు. ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడమే నిజమైన నాయకత్వానికి నిదర్శనమని అన్నారు. ప్రజాక్షేత్రంలో పనిచేస్తున్న తమలాంటి వారికి ఈ కార్యక్రమం ఎంతో ప్రోత్సాహాన్ని అందిస్తుందని పేర్కొంటూ, కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న సంస్థకు, వ్యవస్థాపకులు ఒగ్గు సతీష్ సోదరులకు హృదయపూర్వక అభినందనలు, ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో మరెందరో ప్రజాసేవకులకు ఈ వేదిక ద్వారా గుర్తింపు, గౌరవం లభించాలని ఆకాంక్షించారు.



ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి.. పెండింగ్‌లో ఉంచితే చర్యలు తప్పవు

సూర్యాపేట, నవంబర్ 16: ప్రజల సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి అధికారులు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, అందిన ప్రతి దరఖాస్తును నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు. సోమవారం సూర్యాపేట సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి మొత్తం 152 వినతులను స్వీకరించారు. అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణికి జిల్లా స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని స్పష్టం చేశారు. జిల్లా, మండల స్థాయిల్లో అందే ప్రజావాణి దరఖాస్తులన్నింటినీ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని, ఇప్పటికే పోర్టల్‌లో పెండింగ్‌లో ఉన్న అర్జీలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని సూచించారు. కొత్తగా అందే దరఖాస్తులను కూడా ఎప్పటికప్పుడు నమోదు చేస్తూ, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా రాష్ట్ర స్థాయి ప్రజావాణిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రతి అధికారి తమ లాగిన్‌లో ఉన్న పెండింగ్ అర్జీలను వెంటనే పరిష్కరించాలని, నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండల స్థాయిలో ప్రారంభమైన ప్రజావాణి కార్యక్రమాలకు అన్ని శాఖల మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా జిల్లా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. స్థానికంగా పరిష్కరించగలిగే సమస్యలను మండల స్థాయిలోనే పరిష్కరిస్తే ప్రజలకు సమయం, వ్యయప్రయాసలు తగ్గుతాయని పేర్కొన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో రెవెన్యూ, భూ సమస్యలకు సంబంధించి 52, మహిళా శిశు సంక్షేమ శాఖకు 32, డీఆర్డీఓకు 16, డీపీఓకు 7, మున్సిపాలిటీకి 7, ఇతర శాఖలకు సంబంధించి 38 దరఖాస్తులు అందినట్లు కలెక్టర్ వెల్లడించారు. మొత్తం 152 వినతులను సంబంధిత శాఖలకు పంపించి పరిష్కార చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, డీఆర్వో ప్రేమ్ రాజ్, జడ్పీ సీఈఓ శిరీష, డీఆర్డీఓ పీడీ సన్యాసయ్య, డీఏఓ శ్రీధర్ రెడ్డి, డీడబ్ల్యూఓ నరసింహారావు, డీఐఈఓ సులోచన రాణి, డీవైఎస్ఓ వెంకటరెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఉపేందర్, మున్సిపల్ కమిషనర్ హనుమంత్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి.. పెండింగ్‌లో ఉంచితే చర్యలు తప్పవు

సూర్యాపేట, నవంబర్ 16: ప్రజల సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి అధికారులు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి మొత్తం 152 వినతులు అందాయి. అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సోమవారం జరిగే ప్రజావాణికి జిల్లా స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా, మండల స్థాయిల్లో స్వీకరించే ప్రజావాణి దరఖాస్తులన్నింటినీ ఆన్‌లైన్ పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. పోర్టల్‌లో పరిష్కారం కాకుండా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని, కొత్తగా అందే వినతులను ఎప్పటికప్పుడు నమోదు చేసి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా రాష్ట్ర స్థాయి ప్రజావాణిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రతి అధికారి తమ లాగిన్‌లో ఉన్న పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని, నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు సమర్పించిన అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని స్పష్టం చేశారు. మండల స్థాయిలో నిర్వహించే ప్రజావాణికి అన్ని శాఖల మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా జిల్లా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. మండల స్థాయిలో పరిష్కరించగలిగే సమస్యలను స్థానికంగానే పరిష్కరిస్తే ప్రజలకు ఇబ్బందులు తగ్గుతాయని పేర్కొన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో రెవెన్యూ, భూ సమస్యలకు సంబంధించి 52, మహిళా శిశు సంక్షేమ శాఖకు 32, డీఆర్డీఓకు 16, డీపీఓకు 7, మున్సిపాలిటీకి 7, ఇతర శాఖలకు సంబంధించి 38 దరఖాస్తులు అందినట్లు కలెక్టర్ తెలిపారు. మొత్తం 152 వినతులను సంబంధిత శాఖలకు పరిష్కార నిమిత్తం పంపించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, డీఆర్వో ప్రేమ్ రాజ్, జడ్పీ సీఈఓ శిరీష, డీఆర్డీఓ పీడీ సన్యాసయ్య, డీఏఓ శ్రీధర్ రెడ్డి, డీడబ్ల్యూఓ నరసింహారావు, డీఐఈఓ సులోచన రాణి, డీవైఎస్ఓ వెంకటరెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఉపేందర్, మున్సిపల్ కమిషనర్ హనుమంత్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి కాలువలో పడి ట్రాక్టర్ డ్రైవర్ మృతి



అనంతగిరి, నవంబర్ 16: రాత్రి వేళ బంధువును కోదాడలో దించి తిరిగి స్వగ్రామానికి వస్తున్న వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఘటన అనంతగిరి మండల పరిధిలోని కానాపురం గ్రామ శివారులో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం అనంతగిరి గ్రామానికి చెందిన చెవుల హనుమంతరావు (50) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. నవంబర్ 15వ తేదీ రాత్రి 7 గంటల సమయంలో తన బంధువు చల్లా నరసయ్యను కోదాడలో దించి వస్తానని చెప్పి బైక్‌పై ఇంటి నుంచి బయలుదేరాడు. అయితే రాత్రి అయినప్పటికీ తిరిగి ఇంటికి చేరకపోవడంతో కుటుంబ సభ్యులు అతని కోసం వెతికారు. ఈ క్రమంలో నవంబర్ 16వ తేదీ ఉదయం సుమారు 6 గంటల సమయంలో కానాపురం గ్రామ శివారులో రోడ్డు పక్కన ఉన్న పంట కాలువలో హనుమంతరావు మృతదేహం పడి ఉన్నట్లు గ్రామస్థుల ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. అక్కడికి చేరుకున్న భార్య చెవుల లక్ష్మి తన భర్త మృతి చెందినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. రాత్రి ఇంటికి తిరిగి వస్తున్న సమయంలో బైక్ అదుపుతప్పి కాలువలో పడిపోవడంతో ప్రమాదం జరిగి ఉండవచ్చని ఫిర్యాదులో పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు. తన భర్త మృతిపై ఎలాంటి అనుమానాలు లేవని ఆమె వెల్లడించింది. ఫిర్యాదు మేరకు అనంతగిరి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏళ్ల నిరీక్షణకు తెర.. పోతిరెడ్డిపల్లిలో అర్హులకు పెన్షన్లు మంజూరు



అందోల్ నవంబర్ 16 (సందేశం టైమ్స్ ప్రతినిధి):సంగారెడ్డి జిల్లా అందోల్ మండలం పోతిరెడ్డిపల్లి గ్రామంలో ఎన్నో ఏళ్లుగా పెన్షన్ల కోసం ఎదురుచూస్తున్న వితంతువులు, వికలాంగులు, ఒంటరి మహిళల నిరీక్షణకు తెరపడింది. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం పెన్షన్లు మంజూరు చేయడంతో గ్రామ సర్పంచ్ విజయలక్ష్మి వారికి పెన్షన్ మంజూరు పత్రాలను అందజేశారు. చాలా కాలంగా పెన్షన్ల కోసం ఎదురుచూస్తున్న తమకు ప్రభుత్వం పెన్షన్లు మంజూరు చేయడం పట్ల లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. పెన్షన్లు తమ జీవనానికి ఆర్థికంగా ఎంతో తోడ్పాటును అందిస్తాయని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ విజయలక్ష్మికి, ప్రభుత్వానికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.



పేదల ముఖాల్లో చిరునవ్వులే నా ప్రజాసేవకు నిజమైన సార్థకత.. సర్పంచ్ వొగ్గు సాయికిరణ్ యాదవ్

అందోల్ నవంబర్ 16 (సందేశం టైమ్స్ ప్రతినిధి)సంగారెడ్డి జిల్లా అందోల్ మండల్ లో ఎన్నో సంవత్సరాలుగా పెన్షన్ల కోసం ఎదురుచూస్తున్న అర్హులైన వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, ఒంటరి మహిళలకు పెన్షన్లు మంజూరు కావడం తన జీవితంలో మరపురాని రోజుగా నిలిచిపోయిందని నేరడిగుంట, మక్తాగూడెం గ్రామపంచాయతీ సర్పంచ్ వొగ్గు సాయికిరణ్ యాదవ్ అన్నారు. పెన్షన్ పత్రాల కోసం వచ్చిన లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దగ్గరుండి వారి సమస్యలను తెలుసుకుని, ఆటోలను ఏర్పాటు చేసి స్వయంగా ఆటోల్లో తీసుకెళ్లి పెన్షన్ పత్రాలు అందుకునేలా సహకరించినట్లు తెలిపారు. పెన్షన్ మంజూరు పత్రాలను చేతుల్లో పట్టుకున్నప్పుడు లబ్ధిదారుల కళ్లలో కనిపించిన ఆనందబాష్పాలు, ముఖాల్లో చిరునవ్వులు తనకు ఎంతో సంతృప్తినిచ్చాయని పేర్కొన్నారు. ప్రజలకు సేవ చేయడానికి లభించిన సర్పంచ్ పదవి ఎంతో బాధ్యతతో కూడుకున్నదని, పదవి కంటే దాని ద్వారా పేద కుటుంబాల ముఖాల్లో చిరునవ్వులు తీసుకురావడమే తనకు ముఖ్యమని స్పష్టం చేశారు. ప్రజల కష్టాల్లో తోడుగా ఉండటం, అవసరాల్లో అండగా నిలవడం, వారి ఆనందంలో భాగస్వామి కావడమే తన ప్రజాసేవా లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఈశ్వర్‌తో పాటు గ్రామపంచాయతీ వార్డు సభ్యులు పాల్గొని కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించారు. వారికి సర్పంచ్ వొగ్గు సాయికిరణ్ యాదవ్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.



మంత్రి వేదికపై ఉండగానే రసాభాస.. పోలీసులకు, బీఆర్ఎస్ నాయకులకు మధ్య వాగ్వాదం

నర్సాపూర్, నవంబర్ 16 (సందేశం టైమ్స్ ప్రతినిధి): మెదక్ జిల్లా నర్సాపూర్ పట్టణంలో సోమవారం నిర్వహించిన నూతన చేయూత పెన్షన్ల మంజూరు ఉత్తర్వుల పంపిణీ కార్యక్రమంలో పోలీసులకు, బీఆర్ఎస్ నాయకులకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకోవడంతో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పట్టణంలోని సాయికృష్ణ గార్డెన్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి, ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పెన్షన్ల మంజూరు ఉత్తర్వుల పంపిణీ సందర్భంగా బీఆర్ఎస్ కౌన్సిలర్ మోయిజ్‌ను సభా వేదికపైకి వెళ్లేందుకు పోలీసులు అనుమతించకపోవడంతో బీఆర్ఎస్ నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ పోలీసులతో వాగ్వాదానికి దిగారు. మంత్రి, ఎమ్మెల్యే వేదికపై ఉండగానే ఈ పరిణామం చోటుచేసుకోవడంతో కార్యక్రమంలో కొద్దిసేపు గందరగోళం నెలకొంది. అనంతరం పోలీసులు కౌన్సిలర్ మోయిజ్‌ను వేదికపైకి అనుమతించారు. ఈ సందర్భంగా మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నయుముద్దీన్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లను మాత్రమే వేదికపైకి అనుమతించి బీఆర్ఎస్ కౌన్సిలర్‌ను అడ్డుకోవడం సమంజసం కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులందరికీ సమానమైన ప్రోటోకాల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు.

బివిఆర్ఐటీలో ఘనంగా 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు.. విద్యార్థులకు పుస్తక పఠనంపై అవగాహన



నర్సాపూర్, నవంబర్ 16 (సందేశం టైమ్స్ ప్రతినిధి): బి.వి.రాజు సాంకేతిక విద్యాసంస్థ (బివిఆర్ఐటీ) ఆధ్వర్యంలో 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని నర్సాపూర్‌లోని విష్ణు ఉన్నత పాఠశాల విద్యార్థులకు గ్రంథాలయాల ప్రాముఖ్యత, పుస్తక పఠనం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల సంచాలకులు డాక్టర్ కె. లక్ష్మీ ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు తమ విద్యాభ్యాసంలో గ్రంథాలయాలకు ప్రాధాన్యతనిస్తూ పుస్తక పఠనం ద్వారా జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని, నూతన విషయాలను తెలుసుకునే ఆసక్తిని అలవర్చుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంజయ్ దూబే మాట్లాడుతూ విద్యార్థుల విద్యా ప్రగతి, విజ్ఞాన సముపార్జన, వ్యక్తిత్వ వికాసంలో గ్రంథాలయాలు కీలక పాత్ర పోషిస్తాయని, ప్రతి విద్యార్థి పుస్తక పఠనాన్ని దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని తెలిపారు. అనంతరం కళాశాల గ్రంథపాలకులు డాక్టర్ ఎ. మల్లికార్జున గ్రంథాలయంలో అందుబాటులో ఉన్న పుస్తకాలు, విజ్ఞాన వనరులు, గ్రంథాలయ సేవల గురించి విద్యార్థులకు వివరించారు. విద్యార్థుల్లో పుస్తక పఠనంపై ఆసక్తిని పెంపొందించి, గ్రంథాలయాలను విజ్ఞాన కేంద్రాలుగా వినియోగించుకునేలా ప్రోత్సహించడమే కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల నిర్వాహకులు బి. బాపిరాజు, పరిపాలనాధికారి టి.ఎల్.ఎన్. సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) రిజిస్ట్రేషన్ నం. : TGTEL/25/A0348 , టైటిల్ కోడ్ : Sandhesham Times.ప్రచురణ స్థలం :3- 82 వాయిల సింగారం, అనంతగిరి మండలం,సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త (Publisher): మద్దినేని నాగేశ్వర రావు, సంపాదకులు (Editor) : కాసే అమృత,మొబైల్ : 9052045435, ఈ–మెయిల్ : sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్ : www.sandeshamtimes.com,ముద్రణ (Printed at) : సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press)3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు,ఆంధ్రప్రదేశ్ – 522006.